క్లుప్తంగా

స్థలం కేటాయించాలి



ఎల్లారెడ్డి: రజకుల సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని రజక సంఘం నాయకులు బుధవారం మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందించారు. రజక సంఘం కమ్యూనిటీ భవనానికి నిధులు మంజూరైనా స్థలం లేక పోవడంతో భవన నిర్మాణం పనులు ప్రారంభం కాలేదని అన్నారు. నాయకులు పర్వయ్య, సత్యం, శేఖర్, సంఘమేశ్వర్, స్వరూప తదితరులున్నారు.

సమస్యలపై డిపో మేనేజర్‌కు వినతి



భిక్కనూరు: మండల కేంద్రంలోని బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలపై ఆర్‌టీఏ జిల్లా ప్రతినిధి గంగళ్ల రవీందర్, కామారెడ్డి డిపో మేనేజర్ రేణుకను బుధవారం కలిసి విన్నవించారు. భిక్కనూరు మీదుగా వెళ్లే ప్రతి బస్సు బస్టాండ్‌లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే బస్టాండ్‌లో రంగులు వేయించాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని, మరుగుదొడ్ల మరమ్మతులు చేపట్టాలని, విద్యుత్ సరఫరాను మెరుగుపరచాలని, బస్టాండ్ స్థలం కబ్జా కాకుండా చుట్టూ ఫెన్సింగ్ వేయించాలని ఆయన మేనేజర్‌ను కోరారు.

బంగారు బాట వేయాలి



నిజాంసాగర్(జుక్కల్): ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన కొత్త ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని ఎంఈవోలు అమర్‌సింగ్, తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో విధుల్లో చేరిన కొత్త ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పీఆర్టీయు మండల అధ్యక్షుడు కలకొండ నారాయణ, ప్రధాన కార్యదర్శి సురేందర్ పీఆర్టీయూ నాయకులు భాస్కర్‌గౌడ్, సంతోష్, వెంకటరమణ ఉన్నారు.

టీఎన్‌జీవోస్ తాలూకా అధ్యక్షుడిగా తుల శ్రీనివాస్



బాన్సువాడ: టీఎన్‌జీవోస్ బాన్సువాడ తాలూకా అధ్యక్షుడిగా తుల శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం బాన్సువాడ టీఎన్‌జీవోస్ భవనంలో నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా రవి, ప్రధాన కార్యదర్శిగా అజీమ్, కోశాధికారిగా అబ్దుల్ రజాక్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నరాల వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో టీఎన్‌జీవోస్ ఎన్నికలు జరిగాయని, ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని, ఉద్యోగులందరూ ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు.

ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): టీచర్స్, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు వేసేందుకు నవంబర్ 6లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీవో మన్నె ప్రభాకర్ తెలిపారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో పొలిటికల్ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2021 నాటికి డిగ్రీ పూర్తి చేసిన వారు ఆధార్ కార్డును అటెస్టెడ్ చేసి ఫారం–18ని పూరించాలని, టీచర్ ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో పేరు నమోదు కోసం ఫారం–19ని పూరించాలని అన్నారు. తహసీల్దార్ మహేందర్ కుమార్, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు బాలకిషన్, బబ్లూ, గఫార్, రజాక్ తదితరులున్నారు.

అమ్మో.. మేం పనిచేయలేం!



ఈ ఫోటోలో శిథిలావస్థలో కనిపిస్తున్న భవనం రామారెడ్డి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలది. గత బీఆర్‌ఎస్ సర్కార్ హయాంలో మన ఊరు మన బడి కింద రూ.98 లక్షలు కొత్తగా తరగతి గదులు నిర్మించడానికి నిధులు మంజూరు చేశారు. 8 సార్లు గత ప్రభుత్వ హయాంలోనే టెండర్లు పిలిచారు. కాంట్రాక్టర్లు ఎవరూ పనులు చేయడానికి ముందుకు రాలేదు. కొత్త ప్రభుత్వం వచ్చినా ఈ భవనం అలాగే ఉంది.



ఈ ఫోటోలో కనిపిస్తున్న సగంలో నిలిచిపోయిన భవనం గత సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బస్తీ దవాఖానాది. రూ.20 లక్షల నిధులతో జిల్లాలో అవసరమైన గ్రామాలలో జనాభా ప్రాతిపదికన ఒకటి రెండు చోట్ల నిర్మాణ పనులు చేపట్టారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు రూ.10 లక్షల వరకు ఖర్చు పెట్టారు. చేపట్టిన పనులకు ఎంబీ పూర్తి చేసి అన్ని డాక్యుమెంట్లు సమర్పించినా ఒక్క రూపాయి కూడా బిల్లులు రాకపోవడంతో పనులను మధ్యలోనే ఆపేశారు.

- పనులు చేయడానికి కాంట్రాక్టర్ల విముఖత
- పెండింగ్ బిల్లులు ఉండటమే కారణం
- పలు చోట్ల మధ్యలోనే ఆగిపోయిన పనులు

రామారెడ్డి: గతంలో కాంట్రాక్టర్లు పోటీపడి ప్రభుత్వ పనులు దక్కించుకునేవారు. కొంతకాలంగా ప్రభుత్వ పనులు అంటేనే కాంట్రాక్టర్లు వెనుకడుగేస్తున్నారు. బిల్లులు ఎప్పుడొస్తాయో తెలియని పరిస్థితులు ఉండడంతో ఈ పరిస్థితి దాపురించింది. ఆన్‌లైన్‌లో టెండర్ల ద్వారా ప్రభుత్వ పనులు చేసిన కాంట్రాక్టర్లకు ఏళ్లుగా బిల్లులు రాకపోవడంతో కొత్త పనులు చేయాలంటే కాంట్రాక్టర్లు జంకుతున్నారు. ఏడాదికాలంగా బిల్లులు పెండింగ్‌లోనే ఉండడం.. గత ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు బిల్లులు కూడా పెండింగ్‌లోనే ఉండడంతో కొత్తగా పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. కొత్త పనులకు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ససేమిరా అంటున్నారు. సకాలంలో బిల్లులు విడుదల కాకపోవడంతో అనేక పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. వర్షాకాలంలో రోడ్లు అధ్వానంగా మారడంతో ప్రయాణాలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

పాత బకాయిలు రూ.కోట్లలో..

గత ప్రభుత్వం హయాంలో జిల్లాలో 526 గ్రామపంచాయతీల సర్పంచులు వివిధ రకాల పనుల కోసం సుమారు రూ.50 కోట్లు వెచ్చించారు. అయితే వారి పదవీకాలం ఈ ఏడాది ఫిబ్రవరితో ముగిసింది. నాటి నుంచి బిల్లు కోసం మాజీ సర్పంచులు నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. చేసిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవడంతో.. అభివృద్ధి కోసం నిధులు మంజూరైనా పనులు చేసేందుకు కూడా కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు. దీంతో పల్లెలు అభివృద్ధిలో వెనుకబడుతున్నాయి.ఇప్పటికైనా పాలకులు స్పందించి నిధులు విడుదల చేయిస్తే తప్ప జిల్లాలో అభివృద్ధి పనులు ముందుకు సాగేలా కనిపించడం లేదు.

పనులు ఎలా చేస్తాం



బస్తీ దవాఖానా నిర్మాణానికి రూ.10 లక్షలు ఖర్చు పెట్టాను. ఇప్పటికి రెండేళ్లు అవుతున్నా రూపాయి బిల్లు రాలేదు. చేసిన పనులకు బిల్లులు ఇవ్వకపోతే పనులు ఎలా చేస్తాం.

– రవీందర్ రెడ్డి, అన్నారం

అప్పుల పాలవుతున్నాం



పెండింగ్లో ఉన్న బిల్లులను చెల్లించాలి. రూ. లక్షల ఖర్చు పెట్టి పనులు చేస్తే ఏడాది గడిచినా బిల్లులు ఇవ్వకపోతే ఎలా. అప్పుల పాలవుతున్నాం. అందుకే పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు.

– పరమేష్, గొడుగుమర్రి తండా

పశువులకు తప్పకుండా టీకాలు వేయించాలి



దోమకొండలో టీకాలు వేస్తున్న పశువైద్యులు

దోమకొండ: మండల కేంద్రంతో పాటు అంచనూరులో బుధవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి శివ తెలిపారు. 300 పశువులకు ఉచితంగా టీకాలు వేసి పశువులలో గర్భకోశ వ్యాధుల నిర్ధారణ చికిత్స చేసినట్లు వివరించారు. పాడి రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. లైవ్ స్టాక్ అసిస్టెంట్ కిశోర్, వెటర్నరీ అసిస్టెంట్ భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో..

రాజంపేట: పశువులకు తప్పకుండా గాలికుంటు టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి అనిల్ రెడ్డి అన్నారు. మండలంలో నేటి నుంచి పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు బుధవారం ఆయన తెలిపారు. కార్యక్రమం నవంబరు 14 వరకు కొనసాగుతుందన్నారు.

పాఠశాలకు బెంచీల వితరణ



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బంజారతండా ప్రాథమిక పాఠశాలకు ప్రముఖ శాస్త్రవేత్త, బీజేపీ రాష్ట్ర నాయకులు పైడి ఎల్లారెడ్డి బెంచీలను వితరణ చేశారు. పాఠశాలలోని విద్యార్థులు నేలపై కూర్చొని చదువుకుంటున్నారని స్థానిక నాయకులు ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో 8 బెంచీలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలోని విద్యార్థులు చక్కగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. మాజీ ఎంపీపీ రాజ్‌దాస్, హెచ్‌ఎం మూర్తి, నాయకులు దేవిసింగ్, హన్మాండ్లు, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపైనే పార్కింగ్

- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలో నిత్యం రద్దీగా ఉండే పాత బస్టాండ్ ప్రాంతంలో ఆటోలు, ఇతర వాహనాలు రోడ్లపై నిలుపుతుండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని పలువురు వాపోతున్నారు. స్థానిక పాత బస్టాండ్‌లో మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాలు అడ్డదిడ్డంగా రోడ్డుపై ప్రయాణికుల కోసం నిలుపుతున్నారు. పోలీసులు పాత బస్టాండ్‌లో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగకుండా ఆటో డ్రైవర్లతో మాట్లాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమాచారం..

నేడు బీర్కూర్ బంద్‌కు పిలుపు



బాన్సువాడ: హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులకు నిరసనగా గురువారం బీర్కూర్ బంద్‌కు పిలుపు నిచ్చారు. దేశంలో హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతున్నాయని, కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. బంద్‌కు సహకరించాలని హిందూ సంఘాల నేతలు కోరారు.

శబరిమాత ఆశ్రమంలో పల్లకీ సేవ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో గురువారం పల్లకీ సేవ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో గురువారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్‌రెడ్డి తెలిపారు. నాయకులు, కార్యకర్తలు గ్రామాలలో తిరుగుతూ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నేరుగా చెక్కులను అందజేయాలని సూచించారు.

పీజీటీ సివిక్స్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మోడల్ స్కూల్‌లో పీజీటీ సివిక్స్ పోస్టుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ గాంధీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో పొలిటికల్ సైన్స్ లేదా పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, బీఈడీ అర్హత ఉన్న వారు ఈనెల 18లోగా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. టెట్ అర్హత ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.



సదాశివనగర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ సీఈవో చందర్ నాయక్



మైలారంలో .. సొసైటీ వైస్ చైర్మన్ హన్మంత్‌రావు



బీర్కూర్‌లో.. కాంగ్రెస్ నేతలు



ప్రారంభిస్తున్న గున్కుల్ సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ



జల్దిపల్లిలో.. సొసైటీ చైర్మన్ దేవేందర్ రెడ్డి



భిక్కనూరు మండలం అంతంపల్లిలో .. విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి

విండో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ



భిక్కనూరు: పెద్దమల్లారెడ్డిలోని సింగిల్ విండో ఆధ్వర్యంలో రూ.30 లక్షలతో నిర్మిస్తున్న దుకాణాల సముదాయానికి విండో చైర్మన్ రాజాగౌడ్ బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ఈ షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణం వల్ల విండోకు, రైతులకు, వ్యాపారులకు మేలు కలుగుతుందన్నారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ స్వామి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఇంటింటికి జూనియర్ కాలేజీ అధ్యాపకులు



గాంధారి(ఎల్లారెడ్డి): విద్యార్థులను కాలేజీకి ప్రతిరోజు పంపించాలని కోరుతూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ గంగారాం, అధ్యాపకులు బుధవారం ఇంటింటికి తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. కాలేజీలో ప్రవేశాలు పొందిన విద్యార్థులు కూడా సరిగా క్లాసులకు హాజరు కావడంలేదని, వారి తల్లిదండ్రులకు తెలిపారు. విద్యార్థులు ఇళ్లలో కాలేజీకి వెళ్తున్నామని చెప్పి కాలేజీకి మాత్రం రావడంలేదని తల్లిదండ్రుల దృష్టికి తెచ్చారు.

ఘనంగా గ్యార్వీ వేడుకలు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో మంగళవారం రాత్రి ప్రముఖ హైకోర్టు న్యాయవాది మోహిన్ హమ్మద్ ఖాద్రీ రీసార్ట్‌లో గ్యార్వీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రముఖ న్యాయవాది ఖాద్రి తాను సంపాదించిన సంపదలో కులమతాలకు అతీతంగా కొంత భాగం పేదలకు ఖర్చు చేయడం అభినందనీయమన్నారు. కవాలి కార్యక్రమాన్ని తిలకించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, మాజీ చైర్మన్ సంపత్‌గౌడ్, పాల్గొన్నారు.

షరతుల్లేకుండా జీవన భృతి చెల్లించాలి



మాచారెడ్డి: ఎలాంటి షరతులు లేకుండా బీడీ కార్మికులకు జీవనభృతి చెల్లించాలని డిమాండ్ చేస్తూ బీఎల్‌టీయూ ఆధ్వర్యంలో పాల్వంచ మండల కేంద్రంలో బీడీ కార్మికులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీగా తహసీల్ కార్యాలయానికి చేరుకుని అరగంట పాటు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ జయంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సిద్దరాములు, నేతలు సయ్యద్, రవి, గంగాధర్, బాల్‌కిషన్, ఖాదీర్, మల్లయ్య జీవన్, జగదీష్ ఎల్లయ్య పాల్గొన్నారు.

దళారులకు అమ్మి మోసపోవద్దు



బైరాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్

రైతులు దళారులకు ధాన్యాన్ని అమ్మి మోసపోవద్దని సొసైటీ చైర్మన్లు, అధికారులు అన్నారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులతో కలిసి ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించాలని సూచించారు. ఏ–గ్రేడ్ రకం వరి ధాన్యం క్వింటాలుకు రూ.2320, బీ–గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2,300 చెల్లించనున్నట్లు వివరించారు. సన్న రకాలకు త్వరలో ప్రభుత్వం రూ.500 బోనస్ కూడా చెల్లిస్తుందన్నారు. నిర్ణీత తేమ శాతం ఉండేలా చూసుకొని తీసుకురావాలని రైతులకు సూచించారు. బీర్కూర్ మండలం బైరాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ ప్రారంభించారు.

– సాక్షి నెట్‌వర్క్



కొండాపూర్‌లో.. సింగిల్ విండో చైర్మన్ కంది శివరాములు



శివానగర్‌లో.. డీసీసీబీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



గండిమాసానిపేటలో.. సొసైటీ చైర్మన్ నర్సింలు



గాంధారిలో.. సింగిల్ విండో, ఏఎంసీ చైర్మన్లు సాయికుమార్, పరమేశ్వర్ తదితరులు



తాండూర్‌లో .. ఆర్డీవో మన్నె ప్రభాకర్



చీనూర్‌లో.. సొసైటీ చైర్మన్ నర్సింలు



దోమకొండలో..విండో చైర్మన్ పన్యాల నాగరాజ్ రెడ్డి



పెద్దకొడప్‌గల్‌లో.. తహసీల్దార్ దశరథ్

సంక్షిప్తం

వాహనాల తనిఖీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కామారెడ్డి –ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. ధ్రువీకరణ పత్రాలు లేనివారికి.. సీటు బెల్టులు పెట్టుకోని.. హెల్మెట్లు ధరించని వారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఏఎస్సై సంజీవులు మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలను నడిపినట్లయితే కేసులు నమోదు చేసి కోర్టుకు పంపిస్తామని హెచ్చరించారు. అలాగే చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని, ఇస్తే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మహాధర్నాకు తరలిరావాలి



భిక్కనూరు: విద్యుత్ ఆర్టిజన్స్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం వరంగల్‌లో ఈనెల 17న నిర్వహిస్తున్న మహాధర్నకు కార్మికులు తరలిరావాలని జేఏసీ రాష్ట్ర కార్యదర్శి గంగళ్ల స్వామి కోరారు. బుధవారం ఆయన భిక్కనూరులో మాట్లాడుతూ.. ఆర్టిజన్ వద్దు కన్వర్షన్ ముద్దు పేరిట నిర్వహిస్తున్న ఈ ధర్నాకు రాష్ట్రంలోని విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్స్ కార్మికులు తరలిరావాలన్నారు. వెంటనే గ్రేడ్ మార్చి రాష్ట్రంలోని 20 వేల కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

రికవరీ సెల్‌ఫోన్ అప్పగింత



మాచారెడ్డి: పాల్వంచ మండలం పోతారం గ్రామానికి చెందిన నర్సపురం పోచయ్య ఇటీవల తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా..సీఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసి పట్టుకున్నారు. ఎస్సై అనిల్ బుధవారం రికవరీ చేసిన సెల్‌ఫోన్‌ను పోచయ్యకు అందజేశారు.

ట్రాన్స్‌కో ఏఈ బదిలీ

నిజాంసాగర్(జుక్కల్): మండల ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మణ్ ఆర్మూర్ టెక్నికల్ ఏఈఈగా బదిలీ అయ్యారు. జుక్కల్ ట్రాన్స్‌కో ఏఈ మోహన్, నిజాంసాగర్ మండల ట్రాన్స్‌కో ఏఈగా ఇన్‌చార్జీ బాధ్యతలు అప్పగించారు.

కార్మికుల డబ్బులు తిరిగి చెల్లించాలి



కామారెడ్డి క్రైం: సీఐటీయూ ఆధ్వర్యంలో కామారెడ్డిలోని దేశాయి బీడీ కంపెనీ ఎదుట బుధవారం పెద్ద ఎత్తున కార్మికులు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమ, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. బీడీ కంపెనీ సంవత్సరానికి రూ.20 కోట్లు వరకు కార్మికుల నుంచి అక్రమంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటివరకు కార్మికుల నుంచి వసూలు చేసిన డబ్బులను కార్మికులకే లెక్క చేసి తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నా ఉధృతం కావడంతో పోలీసులు వారిని సముదాయించేందుకు ప్రయత్నించారు. బీడీ కంపెనీ యాజమాన్యంతో మాట్లాడిన అనంతరం చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కంపెనీ యాజమాన్యం ఈనెల 23న చర్చలు జరిపేందుకు దిగివచ్చిందని తెలిపారు. ధర్నాను విరమిస్తున్నట్లు ప్రకటించారు.